క్లుప్తంగా

పథకాలు వినియోగించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ నీరజ

త్రిపురాంతకం: రైతులు ప్రభుత్వం నుంచి అందించే పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.నీరజ తెలిపారు. మండలంలోని మేడపి, ఎండూరివారిపాలెం గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా ఆమె మంగళవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు భూసార పరీక్షలపై వివరించారు. అన్నదాత సుఖీభవ, ఈ–క్రాప్ నమోదు, బిందు సేద్యం ఆవశ్యకతను వివరించారు. రైతులతో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు తహసీల్దార్‌గా నాగలక్ష్మి

తాళ్లూరు (దర్శి): తాళ్లూరు మండల తహసీల్దార్‌గా కె.నాగలక్ష్మి నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న శింగారావు బదిలీపై బాపట్ల జిల్లా జె.పంగులూరుకు బదిలీపై వెళ్లారు. నాగలక్ష్మి ఇప్పటి వరకూ నెల్లూరు కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

త్రోబాల్ పోటీలకు చందలూరు విద్యార్థి



ఇత్తడి ఆనంద్

దర్శి: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు దర్శికి చెందిన చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఇత్తడి ఆనంద్ జయకుమార్ ఎంపికయ్యాడు. చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి విశాఖపట్నంలో ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

పరుగు పందెంలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: యర్రగొండపాలెం నియోజకవర్గం స్థాయిలో జరిగిన పరుగు పందెం పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. యర్రగొండపాలెంలోని ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్లో పోటీలు జరిగాయి. త్రిపురాంతకం మండలం గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు 100 మీటర్స్ 4 రిలే పరుగు పందెంలో కృష్ణ సరిత, వెంకటరజిత, నాగమణి, పావని ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు జి.ఏడుకొండలు, ఎస్ఎంసీ చైర్మన్ గాలిరెడ్డి, పీడీ బాలరాజు అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగే పరుగుపందెంలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జనార్దన్

ముండ్లమూరు (దర్శి): గతంలో మంజూరైన గృహ నిర్మాణాలను డిసెంబర్ లోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ, వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు మధ్యలో నిలిపిన లబ్ధిదారులు వీలైనంత త్వరగా మొదలు పెట్టి పూర్తి చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది మార్చి లోపు పూర్తి చేసుకోకుంటే బిల్లులు మంజూరుకు అవకాశం ఉండదన్నారు. మండలంలో 176 మంది లబ్ధిదారుల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీరంతా తప్పని సరిగా నిర్మాణాలు మొదలు పెట్టాలన్నారు. నిర్మాణ దశను బట్టి బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారులకు అవసరమైన సిమెంట్, ఇనుము తీసుకెళ్లవచ్చన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ ఏఈ హనుమంతరావు, ఏపీఓ కె.నాగరాజు, ఏపీఎం హనుమంతరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ముండ్లమూరు (దర్శి): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం దర్శి డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి డీ బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్‌లు మేరీ డెబ్టిల్లా, ప్రభాకర్, సిబ్బంది నరసింహులు, ఎల్టు సిబ్బంది, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు మోక్షం ఎప్పుడు?

- మూడు నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- జగన్ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, పింఛన్లు నిరంతర ప్రక్రియ



యండ్రపల్లి సచివాలయం

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువుకు చెందిన కొత్త వెంకమ్మ భర్త చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళ్తే కొత్త పింఛన్ల ఇంకా ఇవ్వడం లేదు.. ఇదీ సచివాలయ ఉద్యోగుల సమాధానం. మళ్లీ రావాలని తరుచూ చెబుతుండటంతో ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొందరు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లి అడిగితే అక్కడా ఇవే మాటలు సచివాలయ సిబ్బంది చెబుతున్నారని పలువురు అర్హులు వాపోతున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని కానీ నేడు ఈ ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంతో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక పోతున్నామని ప్రజానీకం చెబుతున్నారు. అంతే కాకుండా కొత్తగా వివాహాలు అయిన వారు కొత్తగా రేషన్ కార్డు పెట్టుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు కరునిస్తుందా.. అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్

ఈ ఏడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఎంటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి అడుతున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, భర్త చనిపోయిన వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్తరేషన్ కార్డుల కోసం ఇలా ఎందరో ప్రభుత్వం సైట్‌కు ఎప్పుడు అనుమతి ఇస్తుందా.. అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో అన్ని రకాల పింఛన్ల 7,965 మందికి అందుతుండగా నేడు అవి చాలా వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో సులభ మార్గం

గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వారు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్‌కార్డులు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం ఇవ్వక పోవడంతో అర్హులైన ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పింఛన్లు, రేషన్‌కార్డులు నిరంతరం ఇవ్వాలి:



పింఛన్లు, రేషన్‌కార్డుల ప్రక్రియ అర్హులకు నిరంతరం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు సైట్ ఓపెన్ చెయకపోవడంతో అర్హులైన వారు ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి. అర్హతే ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

– జి.గురునాథం, సీపీఐ కార్యదర్శి, పుల్లలచెరువు

కొత్త పింఛన్ల మంజూరుకు ఆదేశాలు రావాలి:

కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం ఇంకా లేదు. వచ్చే నెలలో ఆదేశాలు రావచ్చు. వచ్చిన వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

– మరియదాసు, ఇన్‌చార్జి ఎంపీడీవో, పుల్లలచెరువు

ప్లాస్టిక్ వాడకం నష్టదాయకం



లఘునాటికలో విద్యార్థులు

దర్శి: ప్లాస్టిక్ వాడితే నష్టాలు కలిగి పర్యావరణ కలుషితం అవుతుందని కట్టశింగన్నపాలెం ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాలతో కలిగే నష్టాలు వివరిస్తూ విద్యార్థులు ప్లాస్టిక్ బూతం అనే లఘునాటికను పాఠశాలలో ప్రదర్శించారు. విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. గొర్రెపాటి వేణు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పర్యావరణాన్ని కాపాడితే అందరికీ మంచి జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకరరావు, సహోపాధ్యాయులు సీహెచ్ హైమావతి, సయ్యద్ సుభానీ పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

దర్శి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలు చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా దళిత ఉద్యోగులపై దాడులు చేయడం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీలు చించి వేయడం దారుణంగా ఉందన్నారు. రఘురామ కృష్ణంరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలని, భవిష్యత్‌లో ఇటువంటివి జరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రాచపూడి మోషే, దొంతలూరి కోటేషు, మిట్నాల రమేష్, గుంటూరు ఏసుదాస్, మరియబాబు, రాచపూడి లాభాను, గట్టుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచాలి



సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్



డాక్టర్లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

- సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్

పెద్దదోర్నాల: వైద్యశాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిదేనని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ ఆదేశించారు. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించిన నేపథ్యంలో వైద్యశాలపై పలు ఫిర్యాదులు వచ్చాయి. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ త్రివినాగ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నాగ మహేశ్వరి వైద్యశాలలోని స్థితిగతులను వివరించారు. వైద్యశాలలోని చిన్న పిల్లల వార్డుకు సంబంధించిన ప్రధాన గేటును కొందరు ఆక్రమించుకుని వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్నారని ఆమె సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్య ఉందని, పాత డీప్ బోరు పూడిపోయినందున అదనంగా డీప్ బోరును మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు వైద్యశాలకు ఎక్కువగా చెంచు గిరిజనులు వస్తున్న క్రమంలో గిరిజనుల సౌకర్యం దృష్ట్యా వైద్యశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యశాలను పరిశీలించిన సబ్ కలెక్టర్ వైద్యశాల ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి ఉండటాన్ని గమనించారు. ఎంపీడీఓ నాసర్‌రెడ్డిని హుటాహుటిన పిలిపించి వైద్యశాలలోని పిచ్చిమొక్కలు పది రోజుల్లోగా శుభ్రం చేయాలని సూచించారు. ఎంపీడీఓ నాసర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ సూచించారు.

వైద్యశాల అభివృద్ధికి చర్యలు

యర్రగొండపాలెం: స్థానిక ఏరియా వైద్యశాలలో రోగులను పరీక్షించే మంచి డాక్టర్లు ఉన్నారని, నలుగురు సివిల్ సర్జన్ డాక్టర్లు నిరంతరం తమ విధులు నిర్వర్తిస్తున్నారని, అటువంటి వైద్యశాల అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా వెనకబడిన ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు తగిన వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు వైద్యశాలను తనిఖీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. రాత్రి కురిసిన వర్షాలకు వైద్యశాలలోని ల్యాబ్‌లోకి నీళ్లు వచ్చాయని, అందుకు కారణాలు తెలుసుకొని ఆ ప్రాంతాన్ని మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. వైద్యశాల కాంపౌండ్‌లో పారిశుధ్యం లోపించిందని డాక్టర్లు తన దృష్టికి తీసుకొచ్చారని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలకు సరిపడినన్ని మందులు, సిరంజీలు సరఫరా కావడం లేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైద్యశాల సూపరింటెండెంట్ వి.యదిద్యా ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చెట్ల తొలగింపు



చిల్లచెట్లు తొలగింపజేస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు (దర్శి): ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు చిల్ల చెట్లు తొలగింపు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు. తాళ్లూరు నుంచి ముండ్లమూరు వెళ్లే రోడ్డులో మూల మలుపుల్లో చిల్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా పెరిగాయి. రాత్రి పూట లైటింగ్ సరిగా కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించిన ఎస్సై.. చెట్లను పొక్లెయిన్ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు రాత్రిపూట జాగ్రత్తగా చూసుకుని డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రధానంగా మూల మలుపుల్లో డిమ్ డిప్పర్ కొట్టి ప్రయాణించాలన్నారు. చిల్ల చెట్లు కొట్టించిన ఎస్సైని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ప్రధాన రహదారి అద్దంకి–దర్శి మార్గంలో ప్రమాదాల నివారణకు ఎస్ఐ వై.నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మరమ్మతులు చేపట్టారు. మండలంలోని పోలవరం–వేంపాడు మధ్యలో ప్రమాదకర మలుపులు ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు ఆ ప్రాంతంలో చిల్ల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి రావడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మలుపులు వద్ద రోడ్డుకి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో చిల్లచెట్లను తొలగించారు. రహదారి మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ఎస్ఐ చొరవతీసుకొని చర్యలు చేపట్టడంతో పోలీసులను వాహనదారులు అభినందిస్తున్నారు.

అడవి పందిని ఢీకొన్న బైకు.. వ్యక్తికి గాయాలు

యర్రగొండపాలెం: మోటారు బైక్‌కు అడవి పంది బలంగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పుల్లలచెరువు మండలం కొమరోలుకు సమీపంలోని హైవే రోడ్డుపై మంగళవారం జరిగింది. కొమరోలుకు చెందిన ఎం.కొండయ్య పనులపై యర్రగొండపాలేనికి తన మోటారు బైక్‌పై వస్తున్న సమయంలో పొలాల్లో ఉన్న అడవి పంది వేగంగా వచ్చి ఢీకొంది. బైక్ అదుపు తప్పి కిందపడటంతో అతనికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స పొందిన కొండయ్యను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

పంటల లోపాల్లో స్పష్టత ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ



మిరప పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో, ఏవో



దొనకొండ: ఆరవల్లిపాడులో..

తాళ్లూరు (దర్శి): పోషక లోపం ఏదో తెగుళ్ల లోపం ఏదో స్పష్టత ఉండాలని ఏఓ బి.ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని రాజానగరం, మల్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అందరూ సమష్టిగా ప్రతి గ్రామంలో రైతులకు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని చెప్పారు. మంగళ,బుధవారాల్లో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. మొక్కల్లో ప్రస్తుతం అనేక లోపాలు కనిపిస్తాయని చెప్పారు. దీనికి కారణం వాతావరణ లోపమేనని పేర్కొన్నారు. పోషకాల లోపాలతో వచ్చిన మొక్కలు, తెగుళ్లతో వచ్చిన మచ్చలను గుర్తించేలా స్పష్టత ఉండాలని వివరించారు. అప్పుడే నివారణ చర్యలు చేపట్టడం సులువవుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ ఏహెచ్ రాజేష్ మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, గొర్రెలకు నోటి జబ్బు టీకాలు, మినీ గోకులం గురించి వివరించారు. ఎనర్జీ అసిస్టెంట్ కె.నరసింహారావు రైతులకు 9 గంటల విద్యుత్ గురించి వివరించారు. ఫిషరీస్ అసిస్టెంట్ ఎలీషా మాట్లాడుతూ మత్స్యకార లైసెన్స్‌లు మంజూరు గురించి తెలిపారు. విఠలాపురంలో రైతులకు, మహిళా రైతులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వీఏఏ కె.అశోక్, ఏఈఓజీ నాగరాజు, వెటర్నరి అసిస్టెంట్ మార్టిన్ లూథర్, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు కోరారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడమరవీరాయపాలెం, ముష్టగంగవరం గ్రామాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతుల సమావేశం ఏర్పాటు చేసి వారిక సూచనలు, సలహాలు ఇచ్చారు.

దర్శి: పంట విస్తరణ పథకంలో భాగంగా పండ్ల తోటలకు 40 శాతం సబ్సిడీపై అందిస్తున్న నీటి కుంటలు, మినీ ట్రాక్టర్‌లు, తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని బొట్లపాలెం, పాతకమూరు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ వివిధ రకాల పంటల్లో తెగుళ్లు, పురుగులు వాటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. లేటు ఖరీఫ్ సంబంధించి వరి విత్తనాలు ఏపీ సీడ్స్ ద్వారా ఎన్ఎల్ఆర్ 33982 అనే రకాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్, ఉద్యాన అధికారి ఎం.రవివెంకన్నబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బసవయ్య, గ్రామ సహాయకులు షేక్ ముసుం బాజీ దేవసేంకరమ్మ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏవో వి.శేషారెడ్డి, హెచ్‌వో పి.ఆదిరెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మురారిపల్లె, కాశికుంట తండాల్లో పర్యటించి పత్తి, మిరప, కంది పంటలను వారు పరిశీలించారు. పత్తి పంటలో తెల్లదోమ, పచ్చదోమ ఆశించిందని, రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో అన్నారు. మిరప పంటలో ఆశించిన తెల్లదోమ, పచ్చదోమ నివారణకు పసుపు, బ్లూ జిగురు అట్టలను ఎకరాకు 10 ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని హెచ్‌వో సూచించారు. ఏఈవో ఎల్.మాల్యాద్రిరెడ్డి, సెరీకల్చర్ టీఏ నిమ్మయ్య, ఎంపీఏ ఏవో రామయ్య వీఏఏలు ధనేశ్వర్ నాయక్, స్వాతిబాయి పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై పంటల సమస్యకు రైతులు సాగు చేసిన పొలాల్లోనే పరిష్కారం చూపే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన పరికరాలను సబ్సిడీపై అందించేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆరవల్లిపాడులో రైతులతో కలిసి పత్తి, కంది, పొగాకు పంటలను పరిశీలించారు. ప్రతి వారం రోజుకు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులకు సూచన, సలహాలందించారు. పత్తి పంటలో పూత, మొగ్గ రాలుతుందని, దాని నివారణకు పొటాషియం నైట్రేట్ 2 కేజీలు, బోరాన్ 250 గ్రా కలిపి 100 లీటర్ల నీటిలో పిచికారీ చేయాలన్నారు. పంట పొలాల్లో దోమలు, పురుగులు సోకకుండా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకోవాలని వ్యవసాయాధికారి తెలిపారు. మైక్రో ఇరిగేషన్ అధికారి కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం, పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీపై డ్రిప్పులు అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్పంచ్ బాపనపల్లి మంగమ్మ శ్రీను, మాజీ సర్పంచ్ విప్పర్ల చెన్నయ్య, శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దారవీడు: పత్తి పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో పుచ్చకాయలపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వాతావరణం సూచనలకు తగినట్లుగా తెగుళ్ల నివారణ చర్యలు ఎలా చేపట్టాలో తెలియజేశారు. ప్రస్తుతం సీజన్లో ఎక్కువగా వేరుకుళ్లు తెగుళ్లు, వడలు తెగుళ్లు, ఆల్టర్నేరీ ఆకుమచ్చ తెగుళ్లు, పక్షికన్ను తెగుళ్లు వంటివి సోకుతాయని, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు గుర్తింపు లక్షణాల గురించి వివరంగా వివరించారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ బాలునాయక్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా రైతు సేవా కేంద్రంలో పశుగ్రాసం కోసం జొన్న విత్తనాలు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు ఆదిలక్ష్మి, లాలునాయక్, వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల మార్పులపై సమీక్ష సమావేశం



సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల మార్పులపై అన్ని పార్టీల రాజకీయ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1500 ఓట్లు కన్నా ఎక్కువ ఉంటే పోలింగ్ బూత్‌లకు సవరణ తప్పని సరన్నారు. పోలింగ్ బూత్‌లు శిథిలావస్థకు చేరటం వంటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎలక్షన్ కమిషనర్‌కు తెలియజేస్తామన్నారు. పోలింగ్ బూత్‌ల మార్పు జరిగినప్పుడు 100 శాతం పరిశీలన ఉంటుందని, పోలింగ్ బూత్‌ల్లో తేడా అంటే శిథిలావస్థకు చేరటం, అలాంటి పోలింగ్ బూత్‌లను దృష్టిలో పెట్టుకుంటామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల పరిశీలన అయిన తర్వాత నివేదికను ఎలక్షన్ కమిషనర్‌కు తెలియజేస్తామని వివరించారు.